

అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ సేవలు :సీఎం

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. బెంగళూరు మల్లేశ్వరంలోని కేసీ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ డయాలసిస్ సేవలు మధ్య తరగతి, పేద కుటుంబాలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. 219 కేంద్రాల్లో 800 ఉచిత డయాలసిస్ విభాగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు పాల్గొన్నారు.

పులకించిన భక్తజనం

- అంగరంగ వైభవంగా గవిసిద్దేశ్వర రథోత్సవం



అశేష భక్త జనసాగరం నడుమ సాగుతున్న గవిసిద్దేశ్వర బ్రహ్మరథోత్సవం

బళ్లారి గాంధీనగర్, జనవరి 27: దక్షిణభారత దేశంలోనే గవిసిద్దేశ్వర బ్రహ్మ రథోత్సవానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. శనివారం కొప్పళ నగరంలో గవిసిద్దేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జాతర మహోత్సవాన్ని సుత్తూరుమఠంస్వామి ప్రారంభించారు. లక్షలాది భక్త జనం మధ్య రథోత్సవం ఉత్సాహంగా సాగింది. ప్రత్యేక పూలతో అలంకరించిన పల్లకిలో గవిసిద్దేశ్వరస్వామి మూర్తిని రథంలో ప్రతిష్ఠించిన అనంతరం కదిలింది. గవిసిద్దేశ్వర మహారాజ్‌కీ జై అంటు భక్తులు నినదించారు. రథోత్సవానికి తిలకించడానికి వచ్చిన భక్తులు అరటిపండ్లు విసురుతూ మొక్కుబడులు తీర్చుకున్నారు. మహారథోత్సవం పాదగట్టుకు వెళుతున్న సమయంలో భక్తుల్లో సంభ్రమాలు ఆకాశాన్ని అంటాయి. రథోత్సవాన్ని తిలకించడానికి తెల్లవారు జామున నుంచే భక్తులు గవిమఠం ప్రాంగణంలోకి తరలి వచ్చారు. సాయంత్రానికి ఆ సంఖ్య లక్షలు దాటిపోయింది. మైసూరుకు చెందిన సుత్తూరు దేవీ కేంద్రం సుత్తూరు క్షేత్రం శివరాత్రి దేశికేంద్రస్వామీజీ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కన్నడ సంస్కృతి శాఖ మంత్రి శివరాజు తంగడిగా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కొప్పళలోని గవిమఠం 11వ పీఠాధిపతి గవిసిద్దేశ్వర స్వామీజీ స్మరణార్థం ప్రతి యేటా గవిసిద్దేశ్వర జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. రాష్ట్రంలోని నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు చేరుకున్నారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు చర్యలు చేపట్టింది. భక్తులకు అవసరమైన అన్ని వసతులు గవిమఠం ఏర్పాటు చేసింది.



లక్ష్మణసవది వస్తే... స్వాగతిస్తాం

- కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి
- కాంగ్రెస్‌లోకి ఎందరో వస్తుంటారు.. పోతుంటారు : డీకే శివకుమార్

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపముఖ్యమంత్రి లక్ష్మణసవదిలో తమ సిద్ధాంత రక్తం ఉందని, ఆయన బీజేపీలోకి వస్తే సాదరంగా స్వాగతిస్తామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి పేర్కొన్నారు. హుబ్బళ్లిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ బీజేపీలోకి తిరిగిరావడం సంతోషదాయకమన్నారు. ఆరు నెలలక్రితమే ఘర్ వాపసీ విషయమై తనతో చెప్పారన్నారు. ఢిల్లీలో మరో సమావేశం ఉన్నందున శెట్టర్ పార్టీలో చేరే సందర్భంలో పాల్గొనలేకపోయానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో 28 స్థానాల్లో గెలవడమే తమ లక్ష్యమన్నారు. శెట్టర్ పార్టీలోకి చేరడం పట్ల తనకు వ్యతిరేకత లేదన్నారు. తమకు లింగాయతులతోపాటు అందరూ కావాలన్నారు. ధారవాడ లోక్‌సభ ఎన్నికల విషయమై పార్టీ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిందని, అభ్యర్థి పేరు ప్రకటించే విషయంలో తాను మాట్లాడబోనని, ఎన్నికలకు సిద్ధంగా ఉన్నానని పరోక్షంగా తనకే టికెట్ అంటూ ధీమా వ్యక్తం చేశారు. గాలి జనార్దనరెడ్డి కూడా ఒరిజినల్ బీజేపీ వారేనని, ఆయన కూడా పార్టీలోకి రావచ్చు అన్నారు. బెంగళూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో శెట్టర్ ఎదురుపడ్డారని, వెల్‌కమ్‌బ్యాక్ అంటూ మాట్లాడానని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి వందలాదిమంది వస్తారు, వెళ్తారు : డీకే శివకుమార్



కాంగ్రెస్ సముద్రంలాంటిదని, వందలాది మంది నాయకులు వస్తుంటారు, వెళ్తుంటారని, ఎవరు వచ్చి వెళ్లినా పార్టీకి నష్టం కాదని కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. శనివారం కేపీసీసీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ శెట్టర్ బీజేపీపై తీవ్రమైన ఆరోపణలు చేసి కాంగ్రెస్‌లో చేరారన్నారు. పార్టీ టికెట్ ఇచ్చామని, 35వేల ఓట్లతో ఓడినా ఎమ్మెల్సీ చేశామని వివరించారు. రెండు మూడు నెలలుగా బీజేపీ నేతలు చర్చలు జరుపుతున్నారన్నారు. ఇటీవలే తనతో కలసినప్పుడు బీజేపీలోకి వెళ్లేది లేదని స్పష్టం చేశారన్నారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ఎంతోమంది ఎదురుచూస్తున్నారని, తాము సిద్ధాంత పరమైన రాజకీయాలు చేసేవారమన్నారు. శెట్టర్ బీజేపీలోకి వెళ్లడాన్ని చాలామంది కార్యకర్తలు మంచే జరిగిందని అంటున్నారన్నారు.

లోక్‌సభ ఎన్నికలు అగ్ని పరీక్ష

- కలసికట్టుగా క్లీన్ స్వీప్ చేద్దాం
- పార్టీ శ్రేణులకు యడియూరప్ప పిలుపు



రాముడి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సమరం మనకు అతిపెద్ద అగ్ని పరీక్ష కానుందని, రాష్ట్రంలోని మొత్తం 28 నియోజకవర్గాలను కైవసం చేసుకోవడం ద్వారా క్లీన్‌స్వీప్ ఎకు ప్రయత్నిద్దామని పార్టీ శ్రేణులకు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప పిలుపునిచ్చారు. బెంగళూరు ప్యాలెస్ మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ రాష్ట్ర ప్రత్యేక కార్యవర్గ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 2019లో సొంతబలంతో 26 స్థానాలు కైవసం చేసుకున్నామని, ఈసారి మొత్తం 28 స్థానాలు లక్ష్యంగా సంకల్పం బూనాలని పేర్కొన్నారు. తద్వారా ముచ్చటగా మూడోసారి ప్రధాని పట్టాన్ని అధిరోహించడానికి నరేంద్రమోదీకి గొప్ప కానుకగా అందిద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారి తప్పించి అధికారంలోకి వచ్చిందన్నారు. ఏడాదిలోపే కుమ్ములాటలు, పీకల్లోతు అవినీతితో సతమతమవుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుబడిందని, అవినీతి విలయతాండవం చేస్తోందన్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించి వారి విశ్వాసాన్ని చూరగొనాలన్నారు. కరువు కోరల్లో చిక్కుకున్న రైతాంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం విచారకరమన్నారు. కాంగ్రెస్ పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో అరాచకత్వ పాలన ఏర్పడిందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ తిరిగి పార్టీలోకి రావడంతో ఏనుగంత బలం వచ్చిందన్నారు. జేడీఎస్‌తో పొత్తు నేపథ్యంలో సీట్ల పంపిణీ విషయం ప్రస్తావించరాదని ఆయన నేతలకు హితబోధ చేశారు.

అవిశ్రాంతంగా పనిచేద్దాం : విజయేంద్ర

రానున్న లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యేంతవరకు ఎవరూ విశ్రాంతి తీసుకోవద్దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరైనా సరే తేలిగ్గా తీసుకోవద్దని, ప్రతి నియోజకవర్గంలో గెలుపు అత్యంత కీలకమని ఆయన ఉద్బోధించారు. దేశంలోని కోట్లాదిమంది ప్రజల శతాబ్దాల ఆకాంక్షగా ఉన్న రామమందిరాన్ని ప్రధాని మోదీ ప్రారంభించడంతో, దేశంలో రామరాజ్య పరికల్పన ప్రారంభమైందన్నారు. గత తొమ్మిదన్నర సంవత్సరాలుగా ప్రధాని మోదీ దేశాన్ని కొత్తదిశవైపు నడిపిస్తూ ప్రపంచాన్ని సైతం ఆశ్చర్యచకితులను చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు దిగిందని ఆయన విమర్శించారు. వీటికి రానున్న ఎన్నికల్లో ప్రజలు దీటైన సమాధానం ఇవ్వడం ఖాయమన్నారు. కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశ వ్యాప్తంగా బీజేపీ గాలులు బలంగా వీస్తున్నాయన్నారు. కర్ణాటకలో బీజేపీకి పూర్వవైభవం తథ్యమన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోనూ బీజేపీకి ఆశ్చర్యకరమైన ఫలితాలు దక్కబోతున్నాయన్నారు. కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, రాజీవ్‌చంద్రశేఖర్, భగవంత్ ఖూబా, మాజీ ముఖ్యమంత్రులు డీవీ సదానందగౌడ, బసవరాజ్ బొమ్మై, జగదీశ్ శెట్టర్, ప్రతిపక్షనేత ఆర్. అశోక్, మాజీ ఉపముఖ్యమంత్రులు డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, గోవింద కారజోళ, కేఎస్ ఈశ్వరప్పతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సాయంత్రం వరకు సాగిన సమావేశంలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు నేతలు దిశా నిర్దేశం చేశారు.

ప్రధానికి బీజేపీ కార్యవర్గం అభినందన

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోని కోట్లాదిమంది హిందువుల ఆకాంక్షలను ఐదు శతాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం సాకారం చేస్తూ అయోధ్య రామమందిరాన్ని ప్రారంభించినందుకు ప్రధాని నరేంద్రమోదీకి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక సమావేశంలో శనివారం ధన్యవాదాలు తెలియచేస్తూ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశం అనంతరం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రీతమ్‌గౌడ, బెంగళూరు ఉత్తర జిల్లా అధ్యక్షుడు ఎస్ హరీశ్, బెంగళూరు సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సప్తగిరిగౌడ, బెంగళూరు దక్షిణ జిల్లా అధ్యక్షుడు సీకే రామమూర్తి మీడియాతో మాట్లాడారు. రోజంతా జరిగిన సమావేశంలో రెండు తీర్మానాలు ఆమోదించామన్నారు. దళితుల సంక్షేమానికి ఉద్దేశించిన రూ.11వేల కోట్లను దారి మళ్లించడం ద్వారా దళిత వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరో తీర్మానాన్ని ఆమోదించామన్నారు. బీవై విజయేంద్ర రాష్ట్ర బీజేపీ పగ్గాలు చేపట్టాక జరిగిన తొలి కార్యవర్గ సమావేశంలో ఆహ్వానితులలో 85 శాతం మంది హాజరయ్యారన్నారు. ఫిబ్రవరి 3నుంచి 5వరకు అన్ని జిల్లాల్లోనూ కార్యవర్గ సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.


సీఎంతో క్రైస్తవ మతగురువుల భేటీ

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ ధర్మగురువు మోరే మోర్ ఇగ్నేషియ్ అఫెరెమ్ సారథ్యంలో మతగురువుల బృందం నగరంలో శనివారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో భేటీ అయింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సీఎం దృష్టికి తెచ్చినట్లు తెలుస్తోంది. బడ్జెట్‌లో క్రైస్తవుల సంక్షేమానికి అధిక నిధులను కేటాయించాలని కూడా విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి కేజే జార్జి, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎంతో చర్చిస్తున్న క్రైస్తవ మత గురువులు

కాంగ్రెస్ మోసానికి శెట్టరే సాక్ష్యం: మాజీ ప్రధాని దేవెగౌడ



బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నమ్మించి ఎలా మోసాలకు పాల్పడుతుందనేది జగదీశ్‌శెట్టర్ ఉదంతమే సాక్ష్యమని మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ పేర్కొన్నారు. హాసన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం జగదీశ్ శెట్టర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకునే సందర్భంలో చూపిన ఉత్సాహం ఆయనకు తగిన గుర్తింపు, మంత్రి పదవి ఇవ్వడంలో సాధ్యం చేయలేదన్నారు. ఆయన విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఏడాదికిపైగా ముఖ్యమంత్రి పదవిలో శెట్టర్ సమర్థవంతమైన పాలన సాగించారని, ప్రతిపక్షనేతగా వ్యవహరించారన్నారు. అటువంటి సీనియర్ నేతను కాంగ్రెస్ ఎలా మోసం చేసిందనేది ఉదాహరణ అన్నారు. కాంగ్రెస్‌తో కలసి కుమారస్వామి ముఖ్యమంత్రి కావడాన్ని వద్దని వారించానని తెలిపారు. 18 నెలలకే ప్రభుత్వాన్ని కూల్చారని, ఇది కాంగ్రెస్ దుర్మార్గమన్నారు. తాము బీజేపీతో పొత్తుకు ముందే హాసన్‌లో ప్రజ్వల్ ఎంపీగా ఉన్నారన్నారు. ఇదే కారణంతోనే మరోసారి ప్రజ్వల్ పోటీ చేస్తారని ప్రకటించామన్నారు. తాను పోటీ చేస్తాననేది తప్పుడు ప్రచారమన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. మైత్రి ద్వారా ఎన్ని సీట్లు కేటాయిస్తారనేది ఇంకా ఖరారు కాలేదన్నారు. గతంలో వేర్వేరుగా పోరాటాలు చేశామని, ఇప్పుడు మైత్రి ఉన్నందున కలసి పనిచేస్తామన్నారు. రామమందిర విషయంలో సీఎం సిద్దరామయ్య తనలో రాముడు ఉన్నాడని వ్యాఖ్యానించారని, మంత్రి రాజణ్ణ గాంధీ రాముడిని పూజిస్తానని చెప్పారన్నారు. అయోధ్యలో ఉండేది దశరథుడి కుమారుడు రాముడి రూపమన్నారు. మైసూరు శిల్పి యోగిరాజ్ అద్భుతంగా విగ్రహాన్ని తీర్చారన్నారు. కుమారస్వామి వారసుడు నిఖిల్ పోటీ చేసే విషయం ఇంకా నిర్ణయం కాలేదన్నారు. కుమారస్వామి పోటీ అంశం కూడా ప్రధాని నరేంద్రమోదీ తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఇండియా కూటమిలో అప్పుడే అసంతృప్తి పెరుగుతోందన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే యత్నాళ్ చక్కెర ఫ్యాక్టరీ మూసివేత

- కర్ణాటక కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విజయపుర బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌కు చెందిన సిద్దసిరి చక్కెర ఫ్యాక్టరీని మూసివేయాలని కర్ణాటక కాలుష్య నియంత్రణ మండలి శనివారం ఆదేశాలు జారీ చేసింది. కలబురగి జిల్లా చించోళి తాలూకా చిమ్మాయిదలాయి గ్రామ పరిధిలో సిద్దసిరి చక్కెర ఫ్యాక్టరీ నుంచి వెలువడే కలుషిత నీరు ముల్లామురి జలాశయానికి విడుదల చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గాలి, నీరు కలుషిత చట్టం ఉల్లంఘించారనే ఆరోపణల మేరకు ఫ్యాక్టరీని మూసివేయాలని ఆదేశించారు. అదే తరహాలోనే ఫ్యాక్టరీకి నీరు, విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని మండలి ఆదేశించింది. హుమ్నాబాద్ పట్టణ పరిధిలో ప్రసన్న ప్రీ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఇటీవల విషవాయువు కారణంగా ఇద్దరు కార్మికులు మృతి చెందారు. ఇదే సందర్భంలోనే హుమ్నాబాద్ ఫ్యాక్టరీతో పాటు చించోళి తాలూకాలోని యత్నాళ్‌కు చెందిన సిద్దసిరి సౌహార్ద సహకార చక్కెర ఫ్యాక్టరీలను వెంటనే మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే నేతృత్వంలో జరిగిన సభలో రెండు ఫ్యాక్టరీలను మూసివేయాలని తీర్మానించారు. అందుకు అనుగుణంగానే ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా బీజేపీ ఫైర్‌బ్రాండ్‌గా పేరొంది నిత్యం కాంగ్రెస్ నేతలపై విరుచుకుపడే యత్నాళ్‌ను కట్టడి చేసే కుట్రలో భాగంగానే చక్కెర ఫ్యాక్టరీని మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారని విజయపుర జిల్లా బీజేపీ నాయకులు మండిపడ్డారు. రాష్ట్రంలో ఉండే పదుల చక్కెర ఫ్యాక్టరీల నుంచి వెలువడే నీరు బయటకు వచ్చినట్లే ఇక్కడా జరుగుతోందని, రాజకీయంగా ఎదుర్కొనలేక ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే స్పందిస్తూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ రూ.1.5 కోట్ల జరిమానా విధించిందని శనివారం కలబురగిలో మీడియాకు వివరించారు. రాష్ట్రంలో పలు ఫ్యాక్టరీలకు కాలుష్య నియంత్రణమండలి నోటీసులు జారీ చేసిందన్నారు. యత్నాళ్‌పై ఎటువంటి రాజకీయ కుట్రలేదని, నిబంధనల ప్రకారమే నోటీసులు జారీచేశామని వివరణ ఇచ్చారు. ఆదేశాలను పాటించి ఫ్యాక్టరీను మూసివేయకుంటే క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.



బసనగౌడ పాటిల్ యత్నాళ్



చక్కెర ఫ్యాక్టరీ

22న కొత్త నివాసంలోకి ఉపముఖ్యమంత్రి

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అదృష్టం తెచ్చి పెట్టిన ప్రభుత్వ బంగ్లాలోకి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఫిబ్రవరి 22న అడుగిడబోతున్నారు. బెంగళూరు కుమారపార్క్‌లోని ఈ ప్రభుత్వ బంగ్లాలో గతంలో ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో సిద్దరామయ్య ఉండేవారు. ఈ బంగ్లాలో చేరిన తర్వాత ఆయనను సీఎం పదవి వరించడంతో దీన్ని అదృష్టపు బంగ్లాగా పిలుస్తున్నారు. ఈ బంగ్లాను ప్రస్తుతం ఆధునీకరిస్తున్నారు. ఈ ప్రభుత్వ బంగ్లా కోసం ప్రతిపక్ష నేత ఆర్ అశోక్ పట్టుబట్టిన సంగతి తెలిసిందే. ఈ పనులను పరిశీలించేందుకు శనివారం ఆయన బంగ్లాకు విచ్చేశారు. వాస్తుపరంగా ఏమాత్రం మార్పులు చేర్పులు చేయకుండానే దీన్ని ఆధునీకరిస్తున్నారు. ఫిబ్రవరి రెండో వారం నాటికి పనులన్నీ పూర్తవుతాయని అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరి 22న పూజలు చేసిన అనంతరం డీకే శివకుమార్ ఈ అధికార నివాసంలోకి మారనున్నారు. ప్రస్తుతం ఆయన సదాశివనగర్‌లోని తన సొంత నివాసం నుండే విధులను నిర్వహిస్తున్నారు. అదృష్టపు బంగ్లాలోకి అడుగుపెట్టబోతున్న డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రి పదవి దక్కుతుందో లేదో వేచిచూడాలి.

అసంతృప్తి లేదు.. త్వరలో మరో జాబితా : డీకే శివకుమార్

బోర్డులు కార్పోరేషన్ అధ్యక్ష పదవుల తొలి జాబితా అనంతరం కొందరు మంత్రులు ఎమ్మెల్యేలు అసంతృప్తితో రగిలిపోతున్నారంటూ వెలువడుతున్న కథనాల్లో ఎంతమాత్రం నిజం లేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. తన అధికార నివాసం వద్ద శనివారం ఆయన మీడియాతో కొద్దిసేపు మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో విస్తృతంగా చర్చించిన పిమ్మటే 34 మందితో జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు. ఒక వేళ కొద్దిపాటి సమస్యలున్నా పరస్పరం చర్చలతో పరిష్కరించుకుంటామన్నారు. అతి త్వరలోనే పార్టీ కార్యకర్తలు, జిల్లా అధ్యక్షులతో కూడిన 39తో మరో జాబితాను విడుదల చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతి జిల్లాలోనూ వందలాది కమిటీలున్నాయని రాష్ట్ర స్థాయిలోనూ పలు కమిటీలు ఉన్నాయని శాసనసభ ఎన్నికల్లో పార్టీ విజయాల కోసం శ్రమించిన కార్యకర్త లందరికీ సముచిత రీతిలో అవకాశాలను కల్పిస్తామని ఎవరూ నిరాశ పడాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ఏ ఒక్క వర్గానికో పరిమితం కాదని అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ సిద్ధాంతమని డీకే స్పష్టం చేశారు.

రూ.39 కోట్లతో అభివృద్ధి పనులు

- హొస్కోటె - చింతామణి రోడ్డు విస్తరించాలని కేంద్రాన్ని కోరాం
- మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్



భూమిపూజ చేస్తున్న మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

చింతామణి, జనవరి 27: బెంగళూరు రోడ్డులోని హొస్కోటె నుంచి చింతామణి వరకు రోజురోజుకు వాహన సంచారం పెరుగుతున్న తరుణంలో ఈ రోడ్డును చతుష్పథ మార్గంగా మార్పు చేయాలని కేంద్ర రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరిని కోరినట్టు చిక్కబళ్ళాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తెలిపారు. చింతామణి పట్టణం నుంచి రాష్ట్ర రహదాని బెంగళూరుకు వెళ్లే హొస్కోటె వరకు రూ.39 కోట్లతో డాంబరీకరణ పనులకు కైవార క్రాస్‌లో శనివారం భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హొస్కోటె నుంచి చింతామణి వరకు కర్ణాటక రహదారి పథకం కింద చేపట్టిన రోడ్డు పలు చోట్ల దెబ్బతినడంతో ప్రయాణీకులకు వీలుగా డాంబరీకరణ పనులను ప్రారంభించామన్నారు. హొస్కోటె నుంచి చింతామణి వరకు ఉన్న రాష్ట్ర రహదారిని సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మదనపల్లెకు వెళ్లే రాయల్పాడు గ్రామం వరకు విస్తరించాలని కేంద్రాన్ని కోరినట్టు తెలిపారు. అక్కడనుంచి కడప, అమరావతిలకు వెళ్లే రోడ్డును లింక్ చేయాల్సిందిగా కోరామన్నారు. కాగా చిక్కబళ్ళాపుర నుంచి ముళబాగిలు వరకు జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న చింతామణి, శిడ్లఘట్ట, చిక్కబళ్ళాపుర సర్కిళ్ళ అభివృద్ధి పనులు త్వరలోనే జరుగనున్నాయన్నారు. ప్రస్తుతం సదరు రోడ్డు చింతామణి - బెంగళూరు మార్గంలో చెన్నసంద్ర నుంచి శిడ్లఘట్ట రోడ్డులోని తినకల్ గ్రామం వరకు అభివృద్ధి జరుగుతోందన్నారు. మిగిలినది లోక్‌సభ ఎన్నికలకు ముందు లేదా తర్వాత పనులు చేపట్టే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు డాక్టర్ ఎంసీ బాలాజి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజ్, గ్రామీణ అధ్యక్షుడు మురుగమల్లా లక్ష్మీనారాయణ రెడ్డి, జడ్పీ మాజీ అధ్యక్షుడు చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి
మోదీ ప్రధాని కావడం ఖాయం

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతూ కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్న నరేంద్ర మోదీ ముచ్చటగా మూడో సారి ప్రధాని కావడం ఖాయమని చిక్‌పేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ పేర్కొన్నారు. బెంగళూరు ప్యాలెస్ మైదానంలో శనివారం జరిగిన పార్టీ ప్రత్యేక రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. యువనేత బీవై విజయేంద్ర రాష్ట్ర బీజేపీ పగ్గాలు చేపట్టాక పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తోందన్నారు. పార్టీలో యువతకు పెద్దపీట వేయడం సంతోషంగా ఉందన్నారు. ఆహ్లాదకరమైన



ప్రత్యేక కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

వాతావరణంలో ఈ సమావేశం జరిగిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపైనే ప్రధానంగా చర్చించామన్నారు.

దివ్యాంగులకు ఆత్మవిశ్వాసం కల్పించండి

- మాజీ ఎమ్మెల్సీ ఆర్‌వీ వెంకటేశ్ పిలుపు



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ప్రముఖులు

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కావాల్సింది సానుభూతి కాదు. వారిలో ఆత్మవిశ్వాసం కల్పించే ప్రయత్నం చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఆర్‌వీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. బెంగళూరు ఇందిరానగర్‌లోని అంధుల పాఠశాల 25వ వార్షికోత్సవం ఆచార్య రాకుమ్ గురూజీ సారథ్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలో మాజీ శాసనసభ్యులు ప్రమీణా నెసర్గి, నారాయణస్వామి, ఎమ్మెల్సీ చలవాది నారాయణ స్వామి, ఇంటెక్ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీవెంకటేష్, దివ్యాంగుల సంక్షేమ శాఖ కమీషనర్ దాస్ సూర్యవంశీ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బాబూరావ్ ముడబి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బీఎన్ఎస్ రెడ్డి, జయకర్ణాటక సంరక్షణ సంఘం అధ్యక్షుడు గుణ రంజన్ శెట్టి, పోలీసు అధికారి ప్రవీణ్‌లు ముఖ్యఅతిధులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆచార్య రాకుమ్ గురూజీ మాట్లాడుతూ పిల్లలు దేవుడితో సమానమని పోషకులు సాధ్యమైనంత ఎక్కువ సమయం పిల్లలతో గడపాలని సూచించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. కాగా గత పాతిక సంవత్సరాలుగా నిస్వార్థంగా అంధుల పాఠశాలను నిర్వహిస్తూ ఎందరికో దారి దీపంగా ఉన్న రాకుమ్ గురూజీని వక్తలు ప్రశంసించారు. కేవలం ముగ్గురు అంధవిద్యార్థులతో ప్రారంభమైన ఈ పాఠశాల నేడు వేలాది మందితో అలరారుతుండటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వార్షికోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించగా ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ బలరామ రథయాత్ర

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మహాలక్ష్మి లే అవుట్‌లోని ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణ, బలరామ రథయాత్ర శనివారం భక్తి శ్రద్ధలతో జరిగింది. వ్యవసాయ శాఖ మంత్రి ఎన్ చలువరాయస్వామి, స్థానిక ఎమ్మెల్యే గోపాలయ్య పాల్గొన్నారు. అందంగా అలంకరించిన రథంపై బలరామ కృష్ణులను కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. 39వ వార్షిక రథయాత్రను



మంత్రి చలువరాయస్వామి, ఎమ్మెల్యే గోపాలయ్య తదితరులు



ఆలయం వద్ద రథయాత్ర ఇలా..

తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ఇస్కాన్‌లో 1985 నుంచి శ్రీకృష్ణ బలరామ రథయాత్రను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని ఇస్కాన్ అధ్యక్షుడు మధుపండిత్ దాస్ మీడియాకు తెలిపారు. 26 అడుగుల అందమైన రథాన్ని లాగేందుకు 110 అడుగుల పొడవైన తాళ్లను ఏర్పాటు చేశారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు.

గ్రాండ్ మాస్టర్ ఓపెన్ చెస్ టోర్నీ
విజేతగా మిత్రభా గుహ

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో విజేతగా మిత్రభా గుహ నిలిచారు. విజేతలకు డీసీఎం డీకే శివకుమార్ బహుమతులు ప్రదానం చేశారు. శుక్రవారం తొలి బెంగళూరు ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ పోటీలు కంఠీరవా స్టేడియంలో జరిగాయి. ఆరుగురు ఇండియన్ క్రీడాకారులు ఉత్తమ బహుమతులు సాధించారు. మిత్రభ గుహతో పోటీ పడిన జీఎం శ్యాంసుందర్ చివరి నిమిషం దాకా ఉత్కంఠ అనిపించేలా రాణించారు. చివరకు రెండోస్థానంతో సరిపెట్టుకున్నారు. బెంగళూరు అర్బన్ డిస్ట్రిక్ట్ చెస్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన పోటీలలో 20కు పైగా దేశాల నుంచి 20వేల మంది భాగస్వామ్యులయ్యారు. బహుమతుల రూపంలో రూ.55లక్షల నగదును విజేతలకు అందించినట్లు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీసీఎం శివకుమార్

నిర్వాహకులు ప్రకటించారు. బీయూడీసీఏ అధ్యక్షులు సౌమ్యా బియు మాట్లాడుతూ అనేకమంది చెస్ ఆటగాళ్ళ భవిష్యతును రూపొందించేలా పోటీలు సాగాయన్నారు.

ఓటుహక్కుపై పాఠశాలలో జాగృతి

శిడ్లఘట్ట, జనవరి 27: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని తాలూకాలోని జంగమకోటె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై జాగృతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కేహెచ్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఇటీవల ఓటరు సంఖ్య పెరిగినా ఓటుశాతం తక్కువగా ఉందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల కమిషన్ సూచన మేరకు ఓటర్లలో ఓటు హక్కు వినియోగం ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు విషయాన్ని వివరించి వారి చుట్టుపక్కల వారికి కూడా తెలియచేయాలని కోరుతున్నట్టు తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ చిక్కబళ్ళాపుర జిల్లా కార్యదర్శి సీబీ ప్రకాశ్ మాట్లాడుతూ భావిపౌరులైన విద్యార్థులు ఓటు హక్కు ప్రాధాన్యత తెలుసుకోవాలంటూ వివరించారు. రాజ్యాంగబద్ధమైన హక్కును వినియోగించుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఇదే సందర్భంగా ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పురవీధులలో ర్యాలీగా సాగుతూ నినాదాలు



జాగృతిలో పాల్గొన్న ఉపాధ్యాయులు తదితరులు

చేశారు. జంగమకోటె పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, ఉపాధ్యాయులు నాగరత్న డీ లతా, జీఎస్ మేఘ జోషి, సుష్మా, జే వెంకట రత్నమ్మ, సిబ్బంది పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

లాలా లజపతి రాయ్ (జయంతి)



'పంజాబ్ కేసరి'గా పేరొందిన లాలా లజపతి రాయ్ 1865 జనవరి 28న ఫిరోజ్‌పూర్‌లో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుల త్రయమైన లాల్, బాల్, పాల్‌లో తొలి వ్యక్తి. పంజాబ్ నేషనల్ బ్యాంక్, లక్ష్మీ ఇన్సూరెన్స్ సంస్థల సంస్థాపకులు. కాంగ్రెస్ పార్టీ, ఆర్య సమాజ్‌లోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. పలు రచనలు, వ్యాసాలు రాసి ప్రజలలో చైతన్యం తెచ్చారు. సైమన్ కమిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించి పోరాడి గాయపడి చివరకు 1928 నవంబరు 17న కన్నుమూశారు.

గిడుగు వెంకటసీతాపతి (జయంతి)



'కళాప్రపూర్ణ' గ్రహీత గిడుగు వెంకట సీతాపతి 1885 జనవరి 28న విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో తెలుగు వ్యవహారిక భాషోద్యమ సారథి గిడుగు వెంకట రామమూర్తి దంపతులకు జన్మించారు. ప్రసిద్ధ భాషా పరిశోధకుడు, 'విజ్ఞాన సర్వస్వ' నిర్మాత. ఆంధ్రసర్వస్వమునకు అనేక వ్యా సాలు రచించి విశేషంగా తోడ్పడ్డారు. కేంద్రసాహిత్య అకాడమీ అభ్యర్థన మేరకు తెలుగు సాహిత్య చరి త్రను ఆంగ్లంలోకి అనువదించారు. వాషింగ్టన్‌లోని అంతర్జాతీయ అకాడమీ 'డి లిట్' గౌరవంతో సత్క రించింది. 1969 ఏప్రిల్ 19న పరమపదించారు.

పండిట్ జస్రాజ్ (జయంతి)



'పద్మ విభూషణ్' గ్రహీత పండిట్ జస్రాజ్ 1930 జనవరి 28న హర్యానా రాష్ట్రం ఫతేహాబాద్‌లో (అప్పట్లో పంజాబ్ ప్రాంతం) జన్మించారు. హిందూస్తానీ శాస్త్రీయ సంగీతం, మేవాతి ఘరానాకు చెందిన భారతీయ శాస్త్రీయ సంగీత గాయకుడు. ఒక ప్రత్యేక వినూత్న పద్ధతిని జుగల్‌బందీలో ప్రవేశపెట్టారు. పురాతన మూర్ఛనలపై ఆధారపడిన శైలిలో గాయని, గాయకుడు తమ వేర్వేరు రాగాలను ఒకేసారి ఆలపిస్తారు. 'స్కూల్స్ ఫర్ ఇండియన్ క్లాజి కల్ మ్యూజిక్'ను ఏర్పాటు చేసి ఎంతోమందికి సం గీ తం నేర్పించారు. పద్మశ్రీ, పద్మభూషణ్, సంగీత కళా రత్న, సంగీత నాటక అకాడమీ తదితర పుర స్కారా లు పొందారు. 2020 ఆగస్టు 17న కన్నుమూశారు.

డబ్ల్యూబీ యీట్స్ (వర్ధంతి)



విలియమ్ బట్లర్ యీట్స్ 1865 జూన్ 13న ఐర్లండ్‌లో జన్మించారు. కవి, నాటక, వ్యాస రచయితగా 20వ శతాబ్దంలో సాహిత్యంలో తనదైన ప్రత్యేకతను గుర్తింపు పొందారు. ఐరిష్ దేశంలో సాహిత్య వికాసానికి ఎంతో కృషి చేశారు. అబ్బే థియేటర్ స్థాపనకు పాటుపడ్డారు. ఐరిష్ ఫ్రీ స్టేట్‌కు రెండుసార్లు సెనేటర్‌గా వ్యవహరించారు. సాహితీ సేవల కృషికి 'నోబెల్ పురస్కారం' అందు కున్నారు. 1939 జనవరి 28న కన్నుమూశారు.

క్రికెట్‌లో రాణించేందుకు నిరంతర శ్రమ ముఖ్యం



చర్చాగోష్ఠిలో క్రికెటర్ దినేశ్ కార్తీక్

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్‌లో రాణించాలంటే నిరంతర శ్రమ ముఖ్యమని ప్రముఖ క్రికెటర్ దినేష్‌కార్తీక్ అభిప్రాయపడ్డారు. నగరంలో పరిమ్యాచ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన చర్చాగోష్ఠిలో రాయబారిగా వ్యవహరిస్తున్న దినేశ్ కార్తీక్ అభిమానులతో కలిసి సందడి చేశారు. ప్రతి మనిషి వయసుతో సంబంధం లేకుండా వ్యాయామం, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రికెట్ పట్ల ఏటా క్రేజ్ పెరుగుతోందని సీరీస్ ఏదైనా అభిమానులు ఆసక్తి చూపుతున్నారని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఇటీవల స్పోర్ట్స్‌లో రాణించేందుకు తగిన సౌలభ్యాలు పెరిగాయని అందుకు కారణం ఎన్నో సంస్థలు ముందుకు రావడం కారణమన్నారు. క్రికెట్‌కు క్రేజ్ ఉన్నట్లే రాణించాలంటే కఠోర శ్రమ కూడా కీలకమే అన్నారు. పరిమ్యాచ్ స్పోర్ట్స్ క్రికెట్, ఫుట్‌బాల్ క్రీడాకారుల కోసం ప్రో ఆన్ ఫీల్డ్ కిట్‌లను రూపొందిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. డేర్ టు చాంపియన్ అనే కొత్త బ్రాండ్‌ను విడుదల చేశారు.

కొటక్ జీవిత బీమా ద్వారా టర్మ్ పాలసీలు

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో కొటక్ మహేంద్ర లైఫ్ ఇన్సూరెన్ కంపెనీ టియుఎల్ఐపి ద్వారా వినియోగదారులకు టర్మ్ పాలసీలను అందించనుందని ముఖ్యులు వివేక్ ప్రకాష్ అభిప్రాయపడ్డారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ టర్మ్ విత్ యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (టీయుఎల్ఐపీ) ద్వారా అన్ని వర్గాలకు అనుకూలం కానుందన్నారు. వార్షిక ప్రీమియంకు వందరెట్లు జీవిత బీమా రక్షణ కల్పించనుందన్నారు. ఆర్థిక రక్షణ కల్పించడంతో పాటు యూనిట్ - లింక్డ్ బీమా పాలసీల ఆదాయాన్ని పొందే అవకాశం ఉందన్నారు. తీవ్రమైన జబ్బులు లేదా అకస్మిక మరణాలు సంభవించినప్పుడు అదనపు రక్షణ ఇస్తుందన్నారు. పాలసీదారులు మెచ్యూరిటీ ప్రయోజనాలలో భాగంగా పాలసీలో 30శాతం దాకా లాయల్టీ పొందవచ్చు అన్నారు. 10 నుంచి 13వ ఏడాది దాకా ప్రీమియం పంపిణీ కంటే రెండింతలు పొందవచ్చు అన్నారు. పాలసీదారులు అత్యవసర పరిస్థితిలో సొమ్మును వాపసు పొందే అవకాశం ఉందన్నారు. కంపెనీ ఎండీ మహేష్ బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ మా పాలసీ దారులకు టీయుఎల్ఐపీ టర్మ్ పాలసీల ద్వారా సమగ్ర రక్షణ సాధ్యమన్నారు. ఈక్విటీ విభాగం ముఖ్యులు హేమంత్‌కోనవాలాలు ఉన్నారు.

ఎంపీగా రాఘవేంద్రను గెలిపించండి

- కాంగ్రెస్ సీనియర్ నేత శ్యామనూరు పిలుపు

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శివమొగ్గ జిల్లాలో అభివృద్ధిని గమనిస్తే ఉత్తమ ఎంపీని ఎన్నుకున్నారని రానున్న ఎన్నికల్లోనూ ఎంపీగా రాఘవేంద్రను గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత శ్యామనూరు శివశంకరప్ప అభిప్రాయపడ్డారు. ఆయన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో అల్లకల్లోలం సృష్టించినట్టయ్యింది. శివమొగ్గలోని బెక్కినకల్మఠలో శుక్రవారం జరిగిన శరణ సాహిత్య సమ్మేళనంలో అఖిల భారత వీరశైవ మహాసభ అధ్యక్షుడి హోదాలో పాల్గొన్నారు. ఇదే సందర్భంలో ఆయనకు గురు బసవశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం శ్యామనూరు మీడియాతో మాట్లాడుతూ శివమొగ్గ అభివృద్ధి చెందుతోందని అందుకు ఎంపీ బీవై రాఘవేంద్ర కృషి ఉందన్నారు. జిల్లాలో ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాఘవేంద్ర పలు పనులు చేశారన్నారు. మరో రెండు మూడు నెలల్లో జరిగే ఎన్నికల్లోనూ రాఘవేంద్రను గెలిపించడం ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. శ్యామనూరు శివశంకరప్ప వ్యాఖ్యలు అధికార కాంగ్రెస్‌లో అలజడి రేకెత్తించాయి. స్వయాన ఆయన కుమారుడు ఎస్ఎస్ మల్లికార్జున కేబినెట్ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. అయినా బీజేపీ ఎంపీని గెలిపించాలని పిలుపునివ్వడం సర్వత్రా విమర్శలకు కారణమైంది. కాంగ్రెస్‌లో ఏం జరుగుతోందో... అనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల వేళ సీనియర్ నేతలు ఇలా వ్యాఖ్యానించడం సమంజసం కాదని పలువురు మండిపడ్డారు.

కల్యాణ కర్ణాటకలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ ఫెలోషిప్

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక పరిధిలోని జిల్లాల్లో స్థానిక సంస్థలు బలోపేతం చేసే దిశగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ ఫెలోషిప్‌ను ఏర్పాటు చేసింది. కర్ణాటక కర్ణాటక పరిధిలోని 51 తాలూకాలలో అమలు చేయదలిచారు. ఒక్కో తాలూకాకు ఒక్కొక్కరిని రెండేళ్ల వ్యవధి కోసం నియమించుకునేందుకు అవకాశం కల్పించారు. స్థానిక సంస్థలు, వికేంద్రీకరణ వ్యవస్థను బలపరిచేందుకు ఫెలోషిప్‌ను స్థాపించారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో సామాజిక, ఆర్థిక, సామాజిక సమస్యలను పర్యవేక్షించేందుకు స్థానిక సంస్థలకు వీరు చేదోడుగా పనిచేస్తారు. కొత్త ఆలోచనలు, మార్పులు, దూరదృష్టితో పాలనా వ్యవహారాలలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు విద్యావంతులకు తగిన నైపుణ్యత కల్పించనున్నారు. జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ, గ్రామపంచాయతీల అభివృద్ధి కార్యకలాపాలు అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో స్థితిగతులపై అధ్యయనం చేసి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు వివరిస్తారు. ఎంపికైన ఫెలోషిప్‌లకు నెలవారీ రూ.60వేల వేతనం ఇవ్వనున్నారు. కార్యకలాపాలను అమలు చేసేందుకు పది గ్రామ పంచాయతీలను ఎంపిక చేస్తారు. సమాజసేవ ఆసక్తి కల్గినవారే ఫెలోషిప్‌లు చేసేందుకు రావాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ప్రియాంక ఖర్గే అభిప్రాయపడ్డారు.

మద్యం తాగి బస్సు నడిపితే...
ఇక డ్రైవింగ్ లైసెన్స్ రద్దు : రవాణాశాఖ హెచ్చరిక

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి బస్సులు నడిపే డ్రైవర్లపై కొరడా ఝళిపించనున్నారు. ప్రభుత్వ లేదా ప్రైవేట్ బస్సులు నడిపే డ్రైవర్లు మద్యం సేవించినప్పుడు ధ్రువీకరించబడితే తక్షణం వారి లైసెన్స్‌ను రద్దు చేస్తామని రవాణాశాఖ హెచ్చరించింది. నగర ట్రాఫిక్ పోలీసులతో కలసి బెంగళూరులో రెండు రోజులుగా ప్రైవేట్ బస్సులలో అకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. మెజస్టిక్, యశ్వంతపుర తదితర ప్రాంతాలలో రాత్రి 8 గంటలనుంచి అర్ధరాత్రి వరకు డ్రైవర్లకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. గురువారం రోజు 851మంది డ్రైవర్‌లకు శుక్రవారం 600మంది డ్రైవర్‌లను తనిఖీ చేశారు. ఇలా తనిఖీలు చేసిన సమయంలో మద్యం తాగినట్టు ధ్రువీకరించబడిన కొందరి డ్రైవింగ్ లైసెన్సుల రద్దుకు సిఫారసు చేసినట్టు నగర ట్రాఫిక్ విభాగం జాయింట్ పోలీస్ కమిషనర్ ఎంఎన్ అనుచేత్ మీడియాకు తెలిపారు. ప్రయాణీకుల సురక్షత కోసమే ఈ నిఖీలు నిర్వహిస్తున్నామే తప్ప ఎవరినీ వేధించేందుకు కాదని స్పష్టం చేశారు. 2023లో 24చోట్ల ప్రైవేట్ బస్సులు ప్రమాదాలకు లోనై భారీగా ప్రాణనష్టం జరిగిందన్నారు. ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు మద్యం తాగి విధులలో పాల్గొంటున్నట్టు ప్రయాణీకులనుంచి ఆరోపణలు రావడంతోనే తనిఖీలు చేశామన్నారు. అయితే ఇవి కేవలం ప్రైవేట్ బస్సులకే పరిమితం కాదని, కేఎస్ఆర్టీసీతోపాటు అంతర్రాష్ట్ర బస్సు డ్రైవర్‌లకు కూడా వర్తిస్తుందన్నారు. రవాణాశాఖ సహకారంతోనే తనిఖీలు జరిపామన్నారు. జరిపేముందు డ్రైవర్‌లను జాగృత పరిచే కార్యక్రమాలు కూడా నిర్వహించామన్నారు.

బెంగళూరు - ఆనేకల్ మధ్య మెట్రో రైళ్లు

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలో ట్రాఫిక్ వత్తిడిని చాలా వరకు తగ్గించిన నమ్మ మెట్రో తన పరిధిని రానున్న రోజుల్లో మరింతగా విస్తరించుకునే సంకేతాలు కనిపిస్తున్నాయి. బెంగళూరు నగర శివారులోని ఆనేకల్‌కు మెట్రో రైళ్ళ సేవలను విస్తరించే దిశలో డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను సిద్ధం చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. డిపిఆర్‌ను సిద్ధం చేయాల్సిందిగా ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులకు సూచన చేశామన్నారు. ఆనేకల్ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని మెట్రో రైళ్ళు అందుబాటులోకి వస్తే ఇది మరింత వేగిరం కావడం ఖాయమన్నారు. కాగా బెంగళూరు-తుమకూరుల మధ్య మెట్రో రైలుసేవలను పీపీపీ విధానంలో అమల్లోకి తెచ్చే ఉద్దేశ్యం ఉందని హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర పేర్కొన్నారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రతిపాదన ఇంకా డీపీఆర్ స్థాయిలోనే ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి మంజూరు చేస్తే చాలని పెట్టుబడి పెట్టేందుకు అనేక కంపెనీలు ఆసక్తితో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ మెట్రో మార్గం సిద్ధమైతే బెంగళూరు నగర ట్రాఫిక్ వత్తిడి గణనీయంగా తగ్గుతుందన్నారు. మెట్రో రైలు నిర్మాణం సాధ్యంకాకపోతే కనీసం సబ్ అర్బన్ రైలు ప్రతిపాదననైనా సీరియస్‌గా పరిశీలించాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డీసీఎంతో హోంశాఖ మంత్రి చర్చలు

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర్ శనివారం బెంగళూరులోని సదాశివనర్‌లో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను భేటీ అయ్యారు. ఉభయ నేతలు దాదాపు గంటకు పైగా సమాలోచనలు జరుపడం ఆసక్తి రేకెత్తిస్తోంది. బోర్డులు, కార్పోరేషన్ అధ్యక్ష పదవుల పందేరం అనంతరం కొందరు మంత్రుల్లో అసంతృప్తి నెలకొని ఉన్నట్లు కథనాలు వినిపిస్తున్న నేపథ్యంలో వీరిద్దరి భేటీ రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. డీకే శివకుమార్‌ను కలిసిన ప్రముఖుల్లో జేడీఎస్ నేత ఎమ్మెల్యే సూరజ్ రేవణ్ణ తదితరులున్నారు. మర్యాదపూర్వకంగానే డీకేను కలిశానని ఆయన మీడియాకు చెప్పారు.

'పద్మ' విజేతలకు ప్రత్యేక అభినందన


బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్‌ను అందుకోబోతున్న భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుని, మెగాస్టార్ చిరంజీవిని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు డా.ఎ.రాధాకృష్ణరాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు నగరంలో శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ రాజకీయాల్లో ఒక కొత్త ఒరవడి సృష్టించి వన్నెతెచ్చిన తనకు అత్యంత ఆత్మీయుడైన ముప్పవరపు వెంకయ్యనాడుకు ఈ పురస్కారం ఎంతో సముచితంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కాగా చలన చిత్ర పరిశ్రకు నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న మెగాస్టార్ చిరంజీవికి పద్మ విభూషణ్ దక్కడం సంతోషంగా ఉందని తెలుగు జాతి గౌరవించదగ్గ తెలుగుతేజాలకు అత్యున్నత పురస్కారాలు లభించడంతో ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఆనందంతో పులకించారని ప్రకటనలో డా.రాజు పేర్కొన్నారు. తెలుగు విజ్ఞాన సమితి తరుపున ఈ ఇద్దరు మహానుభావులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

బళేపేటలో అగ్నిప్రమాదం.. అపార నష్టం

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యాపార సందడిగా ఉండే బళేపేటలోని పెయింట్స్ దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బళేపేటలోని ఓ భవనంలో పెయింట్స్ నిల్వ ఉంచగా శనివారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కాసేపటికే ఈ ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్ము కున్నాయి. సమీప వాసులు పరుగులుతీశారు. 20ఏళ్లుగా పెయింట్స్ దుకాణాన్ని కృష్ణమూర్తి అనే వ్యక్తి నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆయన అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైరింజన్‌లు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశాయి. రూ.30లక్షల పైగా నష్టం వాటిల్లినట్టు అంచనా.

రెగ్యులర్ డాక్టర్‌ను నియమించండి

చేళూరు, జనవరి 27: తాలూకాలోని బురుడగుంట గ్రామపంచాయతీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాలనుంచి 50మందికి పైగా వస్తుంటారు. అయితే రెగ్యులర్ డాక్టర్ లేకపోవడమే కాక సిబ్బంది కొరత కారణంగా రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వైద్యం కోసం శిడ్లఘట్ట, చింతామణి, చిక్కబళ్ళాపుర పట్టణాలకు వెళ్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.60	1,617.62
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	539	8,419
సామర్థ్యం (టీఎంసీలు)	9.90	54.91

ఆహా! ఏమి రుచి..!

నోరూరిస్తున్న హోళిగలు, రొట్టెలు

కొప్పళ గవిసిద్ధేశ్వర రథోత్సవం సందర్భంగా వేలాదిమందికి మహాదాసోహం

బళ్లారి గాంధీనగర్, జనవరి 27: కొప్పళ నగరంలో గవిమఠం జాతర అంటేనే ప్రత్యేకం. మఠంలో జాతరతో పాటు అనేక ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయి.. మాయాబజార్ సినిమా ఘటోత్కచుని భోజన స్థాయిలో జాతరలో మహాదాసోహ కార్యక్రమం జరుగుతుంది. కొప్పళ నగరంలో ప్రతియేటా జరిగే గవిమఠం జాతర దక్షిణ భారత కుంభమేళా స్థాయిలో జరుగుతుందని చెప్పవచ్చు. రథోత్సవం దినం నుంచి నెలరోజుల పాటు జరిగే జాతర ఉత్సవాలను తిలకించేందుకు లక్షలాదిమంది భక్తులు గవిమఠానికి విచ్చేస్తుంటారు. గవిసిద్ధేశ్వరుడిని దర్శించుకునేందుకు మఠానికి వచ్చిన ఎవరూ కూడా ఆకలితో వెనుదిరుగరాదనేది గవిమఠం పీఠాధిపతి అభినవ గవిసిద్ధేశ్వర స్వామిజీ ఆశయం. అందుచేత జాతర సమయంలో వచ్చే భక్తులకు భారీగా భోజన వ్యవస్థను కల్పిస్తారు. గవిమఠం జాతర జరిగే 21 రోజుల పాటు మహాదాసోహ కార్యక్రమం నిర్వహిస్తారు. అందుకు ప్రత్యేకంగా వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఇప్పటికే వారం నుంచి మహాదాసోహ కార్యక్రమం ప్రారంభమైంది. రథోత్సవం రోజున భక్తులకు భూరి భోజన వ్యవస్థ కల్పించారు. ఈ భోజనంలో రొట్టి, పల్య, వంకాయ పల్లెం, వేరుశెనగతో తయారు చేసిన హోళిగ, మాదలి, నెయ్యిలతో పాటు అనేక తీపిపదార్థాలు, అన్నం సాంబారు భక్తులకు అందజేస్తారు. భక్తులు కూడా మహాదాసోహానికి లక్షలాది రొట్టెలు సిద్ధం చేసుకుని మఠానికి తీసుకొస్తారు. ఈ ఏడాది సింధనూరు భక్తుల బృందం ఏకంగా 8లక్షల రుచికరమైన హోళిగలు సిద్ధం చేసి మఠానికి అందజేయడం విశేషం.




భక్తుల కోసం పెద్ద పెద్ద పాత్రల్లో సిద్ధమవుతున్న భోజనపదార్థాలు, గుట్టలుగా హోళిగలు, రొట్టెలు

శరణుల వచనాలే జీవిత సమస్యలకు పరిష్కారం



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ,జనవరి 27: శరణుల వచనాలు నిత్య జీవితంలోని సమస్యలకు పరిష్కారాలను అందించే పంచాంగం లాంటివని జానెకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల కన్నడ ఉపాధ్యాయుడు సత్యనారాయణ అంటున్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం కోసం పంచాంగాన్ని ఆశ్రయించడం సర్వసాధారణమని, గ్రహనక్షత్రాల ప్రభావం నుండి తప్పించుకోవడానికి పరిహారాలు చేయడం మనకుతెలిసిన విషయమేనన్నారు. కాని మానసిక ప్రశాంతత లేకుండా ఏ గ్రహశాంతి ఫలించదన్నారు. శరణులందరూ తమ శ్లోకాలలో సంతోషకరమైన జీవిత సూత్రాలను చెబుతూ జీవించే మార్గాన్ని వివరించారన్నారు. కార్యక్రమానికి ప్రేమాశ్రమం సుపీరియర్ సిస్టర్ రూస్సీ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ గడ్డిదివాకర్, పరిషత్ అధ్యక్షులు సిద్దలింగప్ప, వేదికపై అతిథులతోపాటు మాతృశ్రీ వీరాక్షిని సత్కరించారు. డాక్టర్ సోమనాథ్ జయశ్రీ, ఉమామహేశ్వరి, కామాక్షమ్మ, జయమ్మ, మంజునాథ్, కొట్రేష్, శాంతకుమారి, కవిత, హేమలత, శోభలత, అచ్యుతానంద తదితరులు పాల్గొన్నారు.

పేటే ఆంజనేయస్వామికి పుష్పాలంకార సేవ



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

సిరుగుప్ప, జనవరి 27: ఘనంగా పేటే ఆంజనేయస్వామికి శనివారం పుష్పాలంకార సేవ నిర్వహించారు. సిరుగుప్ప తాలుకాలో ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయం శ్రీ పేటే ఆంజనేయస్వామికి ప్రధాన అర్చకులు శ్యామాచార్య పూలమాలలు, ఆకుపూజ నిర్వహించారు. భక్తులు అలయ కమిటీసభ్యులు ప్రసాదపంపిణీ చేపట్టారు. సాధువులకు అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాగు సక్రమ సమితికి సభ్యుల నియామకం



ఎమ్మెల్యే నాగరాజును సన్మానిస్తున్న సభ్యులు

సిరుగుప్ప, జనవరి 27: బంజరు భూముల సాగు సక్రమ సమితికి పవన్ కుమార్ దేశాయ్, నాగరాజు, మీనాక్షి, రేష్మ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నూతన సభ్యులను తహసీల్దార్ విశ్వనాథ్, బీఎం నాగరాజు ఆహ్వానించి సన్మానించారు. సిరుగుప్ప తహసీల్దార్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ఎన్నికైన సభ్యులు ఎమ్మెల్యే బీఎం నాగరాజును పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

అభివృద్ధికి నోచుకోని గాంధీపార్కు



కుడితినిలో శిథిలావస్థకు చేరుకున్న గాంధీ విగ్రహం

కంప్లి, జనవరి 27: మహాత్మాగాంధీ పేరుతో పిలువబడే గాంధీ పార్కు అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి గురవుతోంది. జిల్లా పరిధిలోని కుడితిని నడిబొడ్డున వుండే ఈ గాంధీపార్కు పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. చివరికి మద్యపాన ప్రియులకు అడ్డాగా మారింది. జనవరి 26న దేశవ్యాప్తంగా ఎంతో మంది గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకుంటారు. ఆ సందర్భంగా దేశం కోసం పోరాడిన నాయకుల స్మారకాల వద్ద, విగ్రహాల వద్ద పూజా కార్యక్రమాలు చేపడతారు. కానీ కుడితిని పట్టణంలో మాత్రం పార్కులో ఎటువంటి కార్యక్రమం చేపట్టలేదు. ఈ సందర్భంగా రక్షణ వేదిక సంఘ సంస్థ నేతలు తిమ్మప్ప, సంపత్, తదితరులు మాట్లాడుతూ కేవలం పట్టణ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్లే పార్కు అభివృద్ధికి నోచుకోలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్కు పక్కనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. దీని వల్ల గాంధీ విగ్రహం కూలే అవకాశాలున్నాయన్నారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన నాయకుల విగ్రహాల వద్దే అభివృది లేకపోవడం విడ్డూరంగా వుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే కూలడానికి సిద్దంగా వున్న గాంధీ విగ్రహం స్థానంలో నూతన విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. సుందర బృందావనంగా పార్కును తీర్చిదిద్దాలన్నారు. ఆగస్టు 15, జనవరి 26 తేదీల్లో ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్షీణిస్తున్న అడవులు.. పెరుగుతున్న వన్యప్రాణుల బెడద

బళ్లారి సిటీ, జనవరి 27: ఈ సంవత్సరం వర్షాలు లేక సండూరు తాలూకా అటవీప్రాంతంలోని పచ్చని చెట్లు ఎండిపోయి నేలకొరుగుతున్నాయి. ప్రతి ఏటా సెప్టెంబరు, అక్టోబరు నుంచి చలికాలం ముగిసే వరకు సండూర్‌లోని కొండ ప్రాంతాలు అందంగా కనిపించేవి. సండూరు, బళ్లారి తాలూకాలు జిల్లాలో అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగి ఉన్నాయి. ఇక్కడ మొత్తం 65వేల హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంది. అయితే ఈ సారి పూర్తిస్థాయిలో వర్షాలు కురవక పోవడంతో అది అటవీ ప్రాంతంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బళ్లారిలో 40-50శాతం అడవులు నీరులేక ఎండిపోతున్నాయి. దీంతో వన్యప్రాణులు ఆశ్రయం కోసం ప్రజల నివాసాల్లోకి చొరబడే అవకాశాలు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనిపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

మొక్కలు, చెట్ల సంరక్షణ కోసం కసరత్తు

జిల్లాలో పర్యావరణ అభివృద్ధి కోసం ఆటవీశాఖ ఏటా రోడ్డు పక్కన, అటవీ ప్రాంతాలలో లక్షలాది మొక్కలు, చెట్లను నాటుతోంది. అయితే ఈసారి నాటిన మొక్కలు, చెట్లను సంరక్షించేందుకు ఈశాఖ పలు కసరత్తులు చేస్తోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికీ అటవీ ప్రాంతంలో కొండ ప్రాంతాల్లో పెరిగే చెట్లు వర్షపునీటిపైనే ఆధారపడి ఉన్నాయి. దీనికి ప్రత్యామ్నాయం లేదు. అటవీ పాంతంలో పచ్చదనం కనుమరుగై మొక్కలు, చెట్లు ఎండిపోవడంతో వన్యప్రాణులు ఆశ్రయం కోసం గ్రామాల్లోకి వచ్చే అవకాశాలు కూడా ఎక్కువయ్యాయి.. అంతేకాకుండా అడవి ఎండిపోవడంతో మంటలు చెలరేగడం కూడా ఆ శాఖను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ప్రమాదాన్ని వెంటనే నియంత్రించేందుకు ఆశాఖ సన్నద్ధమవుతోంది. మరోవైపు ఖనిజం తవ్వకాలు ఎక్కువగా ఆడవుల్లోనే జరుగుతున్నాయి. ప్రతిరోజు వేలాది లారీల్లో ఖనిజ రవాణా జరుగుతోంది. ఖనిజ రవాణా సమయంలో లారీ డ్రైవర్లు, ఆపరేటర్లు బీడీలు, సిగరెట్లు రోడ్డుపక్కన పడేసే అవకాశాలు ఉన్నాయి. అందువలన కూడా మంటలు చేలరేగుతుంటాయి.

- రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు

జిల్లాలో వన్యప్రాణుల బెడదను నివారించేందుకు బళ్లారి ఆటవీశాఖ సండూర్ నుంచి విడివిడిగా మూడు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి అడవుల్లో మంటలను ఆరికడుతోంది. ఈ బృందం జిల్లాలోని , ఆటవీ గ్రామాలలో నిరంతరం గస్తీ తిరుగుతుంది. ఇప్పటికే ఒక్కో బృందానికి ప్రత్యేక కిట్‌లను పంపిణీ చేసి ఆపరేషన్ ప్రారంభించింది. వన్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా ఆడవిలోని నీటి గుంతల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నామని బళ్లారి డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ పారెస్ట్ సందీప్ సూర్యవంశీ తెలిపారు.



నీరులేక ఎండి పోయిన ఆటవీ ప్రాంతంలోని చెట్లు

టైలర్స్ అసోసియేషన్ రజతోత్సవాన్ని విజయవంతం చేద్దాం

రాయచూరు జనవరి 27 : బెంగళూరులోని శాలిని మైదానంలో ఈ నెల 30న నిర్వహిస్తున్న కర్ణాటక టైలర్స్ అసోసియేషన్ రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని టైలర్స్ సంఘం జిల్లాధ్యక్షుడు మహ్మద్ ఫెరోజ్ హమ్‌రాజ్ కోరారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ నాయకులతో కలిసి ఆయన విలేఖరులతో మాట్లాడారు. రజతోత్సవంతో పాటు రాష్ట్ర స్థాయి సమావేశంలో తీసుకునే నిర్ణయాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. రజతోత్సవాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించనుండగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు పలువురు మంత్రులు హాజరవుతారన్నారు. జిల్లా నుంచి టైలర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న మహ్మద్ ఫెరోజ్ హమ్‌రాజ్

అణగారిన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలి

● మంత్రి నాగేంద్ర ● నేడు చిత్రదుర్గలో సదస్సు



ముందస్తు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బి.నాగేంద్ర

బళ్లారి సిటీ, జనవరి 27: అణగారిన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ మంత్రి బి.నాగేంద్ర తెలిపారు. శుక్రవారం సాయంకాలం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన ముందస్తు ఏర్పాట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అణగారిన వర్గాల పక్షాన ఉందన్నారు. నేటికీ అణగారిన వర్గాల పరిస్థితి మారలేదని, కావున బడుగు బలహీన వర్గాల చైతన్యం కోసం జరిగే సదస్సు విజయవంతానికి అందరూ కృషి చేయాలన్నారు. జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల గెలుపులో అణగారిన వర్గాల ప్రజల పాత్ర ఎంతోఉందన్నారు. సిద్దారామోత్సవాన్ని విజయవంతం చేసినట్లే ఈ మహాసభను కూడా విజయవంతం చేయాలని మంత్రి కోరారు. ఈసందర్భంగా కురుబ సంఘం జిల్లాధ్యక్షుడు గాదిలింగనగౌడ, వక్ఫ్ బోర్డు జిల్లాధ్యక్షుడు హుమాయూన్ ఖాన్, రాంప్రసాద్, వెంకటేశ్ ప్రసాద్, బలిజ సంఘం రమేశ్ బుజ్జి, గొల్లరసంఘం గాదెప్ప, మంజుల, కెరకోడప్ప, దళిత నాయకులు మానయ్య, శివశంకర్, ముండ్రగి బోవి సమాజానికి చెందిన నాగరాజు, మారెన్న, రామాంజనేయులు, తల్వార్ దుర్గన్న, నరసప్ప, కార్పోరేషన్ సభ్యులు మించు శ్రీనివాస్, ప్రభంజన్ కుమార్,పేరం వివేక్, మడివాళ సంఘానికి చెందిన ధనంజయ హమాల్ పాల్గొన్నారు.

పోస్టాఫీసు నెట్ వర్క్ బిజీ.. బిజీ!

వృద్ధులకు తప్పని పడిగాపులు



షుగర్ ఫ్యాక్టరీ పోస్టాఫీసు వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

కంప్లి, జనవరి 27 : ప్రభుత్వాలు వృద్దులకు, మహిళలకు ప్రభుత్వం ద్వారా ఎన్నో పింఛన్లు, సదుపాయాలు కల్పిస్తున్నాయి. అవి పోస్టాఫీసు ద్వారానే వారికి అందుతున్నాయి. కానీ పోస్టాఫీసుల్లో మాత్రం నెట్‌వర్క్ బిజీ కారణంగా పోస్టాఫీసుల వద్ద వృద్దులు, మహిళలు పడిగాపులు కాచే పరిస్థితి ఏర్పడింది. కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో వుండే పోస్టాఫీసు వద్ద ఎంతో మంది పేద కుటుంబాల మహిళలు, అంగవికలాంగులు, పింఛన్లు కోసం వచ్చిన వారు సుమారు ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పడిగాపులు కాచే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై అక్కడున్న పోస్టాఫీసు సిబ్బందిని వివరించగా నెట్ ప్రాబ్లమ్ అని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నెట్‌వర్క్ సమస్య వున్న పోస్టాఫీసుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.

కొట్టూరు బసవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



కంప్లి, జనవరి 27 : విజయనగర జిల్లాలో ప్రసిద్దిగాంచిన కొట్టూరు బసేశ్వరస్వామికి రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి వివిధపూజలుచేసి పూలు పండ్లతో భక్తాదులు మొక్కులు సమర్పించుకున్నారు. మూడురంగులతో కొట్టూరు బసవేశ్వరస్వామికి ప్రత్యేకాలంకరణ నిర్వహించారు.

పిల్లలకు విద్యాభ్యాసం చేయించాలి



వివేకానంద పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జనవరి 27 : ప్రతి ఇంట పిల్లలకు విద్యాభ్యాసం చేసి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. ఆయన కంప్లి పట్టణంలోని వాసవీ కళ్యాణమండపంలో స్వామి వివేకానంద పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిటికన్నా విద్య ఎంతో గొప్పదని, విద్య వుంటే దేనినైనా సాధించవచ్చునన్నారు. పాఠశాల ప్రముఖులు జిలాన్ మాట్లాడుతూ, నిత్య జీవితంలో పేద కుటుంబాల వారికి చదువులు చెప్పించడం ఎంతో హర్షించదగిన విషయమన్నారు. ప్రతి పాఠశాలలో పిల్లలకు విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించాలన్నారు. అనంతరం వివిధ రంగాలలో రాణించిన వారికి సన్మానం చేశారు. అనంతరం సంగీత నాట్యాలతో పిల్లలు అలరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, బడేసాబ్ ఖాద్రి, బసవరాజు, చాంద్ బాషా, వన్నూరువలీ, శ్రీనివాసరావు, శ్రీధర శెట్టి తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

గవర్నర్ వ్యాఖ్యలపై నిరసన



నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు తదితరులు

హోసూరు, జనవరి 27: తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ హోసూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన జరిగింది. ఈ నిరసన ప్రదర్శన సందర్భంగా మేయర్ త్యాగరాజన్ మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర్య పోరాటం కోసం సత్యం, అహింస సూత్రాల ఆధారంగా గాంధీ దేశం కోసం సహాయ నిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమం నిర్వహించారన్నారు. అయితే మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టింది మహాత్మాగాంధీ కాదని, మనకు స్వాతంత్ర్యం తీసుకొచ్చింది నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని గవర్నర్ అన్నారని, ఇలా మాట్లాడేందుకు ఆయనకు ఏ మాత్రం అర్హత లేదన్నారు. తమిళనాడు గవర్నర్‌గా అత్యున్నత హోదాలో ఉంటూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. నిరంతరం తమిళనాడు ప్రజలను కించపరుస్తూ, తమిళుల సంస్కృతిని అవమానిస్తున్నారని మండిపడ్డారు. పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భాషా పోరాట వీరులకు అన్నాడీఎంకే నివాళి

హోసూరు (సిప్‌కాట్) జనవరి 27 : అన్నాడీఎంకే ఆధ్వర్యంలో హోసూరులో భాషా పోరాట అమరవీరులకు నివాళులర్పించేందుకు బహిరంగ సభ నిర్వహించారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే విద్యార్థుల తరుపున హోసూరు కార్పొరేషన్‌లోని బాగలూరు హౌసింగ్ బోర్డు ప్రాంతంలో ఈ సభ జరిగింది. విద్యార్థి జిల్లా కార్యదర్శి వెట్రిచెల్వన్ అధ్యక్షత వహించారు. సభకు విద్యార్థి ఉప కార్యదర్శి అరుణ్ స్వాగతం పలకగా జిల్లా ఉప కార్యదర్శి మదన్, ఏరియా కార్యదర్శులు వాసువేవన్, మంజు, రాజీ, అమ్మ కౌన్సిల్ జిల్లా కార్యదర్శి చిట్టి జగదీశ్, డ్రైవింగ్ టీం జిల్లా కార్యదర్శి చెన్నాకృష్ణన్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు శశివెంకట్ స్వామి ప్రసంగించారు. పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, అన్నాడీఎంకే అధికార ప్రతినిధి శాంతి పాల్గొన్నారు.

ఏనుగులను అడవుల్లోకి తరిమేందుకు యోచన

హోసూరు, జనవరి 27: హోసూరు శానమావు అటవీ ప్రాంతంలో ఉన్న 15 ఏనుగులను డెంకణీకోట అటవీ ప్రాంతానికి తరిమారు. వాటిలో 3 ఏనుగులు తిరిగి రావడంతో వాటిని తిరిగి డెంకణీకోట అటవీ ప్రాంతానికి తరమడానికి అటవీశాఖ చర్యలు చేపట్టింది. ఈ వన్యప్రాణులు గత అక్టోబర్ నెల నుంచి వందకు పైగా అడవుల్లో తిరుగుతూ అభయారణ్యం వదలి గ్రామాలపై తిరుగుతూ పంటలను నాశనం చేస్తూ జవలగిరి అడవుల్లోకి వచ్చాయి. ఈ క్రమంలో 13 ఏనుగులు ఊడేదుర్గం అడవుల్లోకి వెళ్లి అటవీ ప్రాంతంలో ఆశ్రయం పొంది రాత్రి వేళల్లో సమీపంలోని పంటలను నాశనం చేస్తున్నాయి. హోసూరు సమీపంలోని సినిగిరిపల్లి, బెంకెల్ మీదుగా హోసూరు శానమావు అడవుల్లోకి వచ్చాయి. అడవుల్లో ఇప్పటికే ఉన్న ఏనుగులతో కలిసి వాటి సంఖ్య 15కు చేరింది. ఏనుగులపై అటవీశాఖాధికారులు నిఘా పెట్టి దట్టమైనఅడవుల్లోకి తరిమేందుకు కార్యాచరణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



శానమావు అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి



డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న భీమ్ ఆర్మీ నాయకులు

రాయచూరు జనవరి 27 :కలబుర్గి జిల్లా కోటనూర(డి) గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన నిందితులను గుర్తించి కఠిణ చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ నాయకులు డిమాండ్ చేశారు. సంఘటను నిరశాస్తు శనివారం నగరంలోని ప్రధాన రహదారుల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ఈనెల 22న కొంతమంది గుర్తు తెలియని దుండగులు కలబుర్గి జిల్లా కోటనూర(డి) గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించడం దౌర్భాగ్యమన్నారు. దీని వెనక సంఘ్ పరివార శక్తులు ఉంటాయని ఆరోపించిన నిరసనకారులు ప్రభుత్వం వెంటనే నిందితులను అరెస్టు చేసి దేశ బహిష్కార శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగిన సందర్భంగా నిందితుల పట్ల పాలకులు ఉదాసీనంగా ఉండడం వల్లే ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు.

భక్తిశ్రద్ధలతో చంద్రమౌళేశ్వర స్వామి పల్లకి సేవ



పల్లకి సేవ నిర్వహిస్తున్న స్వాములు

రాయచూరు జనవరి 27 : నగరంలోని చంద్రమౌళేశ్వర దేవస్థానం నుంచి స్వామి వారి పల్లకి సేవను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన పల్లక్కి సేవా బసవనభావి సర్కిల్‌లోని వసంతమారుతి ఆలయం వరకు సాగింది. పల్లక్కి సేవలో శివలింగ గురుస్వామి, నాగరాజ్ గురుస్వామి, మహేశ్ గురుస్వామి, రాజేశ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.